వరాలు బాబు నెత్తుకుని బైటికి వచ్చింది. వరండాలో ఎవ్వరూలేరు. వరాలు గబగబా మెట్లు దిగేసింది. అక్కడ చెట్టుక్రింద సత్యం రిక్షాలో కూర్చుని కునుకు దీస్తున్నాడు.

'ఇదుగో, తొందరగ పద — ఆళ్ళు వస్తారు' అని అతన్ని లేపి గబగబా ఎక్కింది.

'డాక్టరమ్మ ఎల్లమందా!' అన్నాడు.

'నువ్వు నోరుమూసుకుని బేగి పద' అంటూ కసిరింది.

సత్యం రిక్షా రఁయ్యిన పోనిచ్చాడు.

కొద్దిదూరం పోయిన తర్వాత రిక్షా ఆపమంది.

'ఏటే' అన్నాడు. వరాలు బావురుమంది. ఏటా, ఆళ్ళు దొంగలు. మన బాబుని రాజేయటానికి ఎత్తేస్తారు. ఏంటేంటో కత సెప్పేస్తున్నారు.'

'అదికాదే.'

'నువ్వు మాట్లాడకు నీకేం తెలియదు. ఇంటికెల్దాంపద.'

సత్యం రిక్షాని యింటికి తీసుకువచ్చాడు.

వరాలు గబగబా యింట్లోకివచ్చి చీరెవిప్పి పక్కింటివాళ్ళ కిచ్చేసి, వున్న రెండుబట్టలూ, సంచిలో కుక్కుకుంది.

'మనం యిక్కడుండద్దు, వూరెళదాం పద' అంది.

'ఏ వూరే?'

'ఏదో ఒకవూరు. ఇక్కడుంటే ఆళ్ళు వచ్చి బాబు నెత్తుకుపోతారు.'

వరాలు ఆడపులిలా వుంది! సత్యం కిమ్మనకుండా బైలుదేరాడు.

ఇద్దరూ బైలుదేరి బైటకి వచ్చేసరికి, యింటిముందు వచ్చి కారు ఆగింది. అందులోనుంచి డాక్టరమ్మ, పోలీసులు దిగారు.

'చూసారా! నేను అనుకున్నదే అయింది! పిల్లాడిని తీసుకుని పారిపోతున్నారు' అంది.

పోలీసులధికారి దగ్గరకి వచ్చాడు. 'ఈ కుర్రాడు యీ క్షణంనుంచీ మా అధీనంలో వుంటాడు. నీబిడ్డ కాడు' అన్నాడు.

